సత్యసాయిబాబా సేవలు విశ్వవ్యాప్తం

● జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ● ఘనంగా శతజయంతి



కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సత్య సాయిబాబాకు నివాళులు అర్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా సేవలు విశ్వవ్యాప్తమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జేసీతోపాటు జిల్లా అధికారులు తొలుత సత్యసాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం శత జయంతి వేడుకల పతాకాన్ని ఆవిష్కరించారు. తదుపరి జేసీ మాట్లాడుతూ సత్యసాయిబాబా తన సేవలతో పుట్టపర్తికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చిన మానవతామూర్తిగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. బాబా ప్రేమ, శాంతి, మానవత, సేవ వంటి విలువలను ఆచరణలో చూపిన మహాత్ముడని అన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయ్‌కుమార్, సమాచార శాఖ డీడీ వేణుగోపాల్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్, సత్యసాయిసేవా సంస్థ సభ్యులు సురేష్‌సింగ్, శేషు, నాగలక్ష్మి, జీవన్‌శేఖర్ పాల్గొన్నారు.



సత్యసాయిబాబా చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎస్పీ అజిత

● పోలీసు కార్యాలయంలో..

నెల్లూరు(క్రైం) : సత్యసాయిబాబా చిత్రపటానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసరావు, గట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, అధికారులు పాల్గొన్నారు.

మేయర్‌పై అవిశ్వాసం

● నేడు కలెక్టర్‌కు నోటీసు అందచేత

● తదుపరి మేయర్ ఎవరు..?

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డితో మంత్రి సమావేశం

● దించేయాలని 40 మంది కార్పొరేటర్ల సంతకాలు



రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డితో కలిసి కార్పొరేటర్ల సమావేశంలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), నవంబరు23(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మెజారిటీ కార్పొరేటర్లు నిర్ణయించారు. టీడీపీ కార్పొరేటర్లు 40 మంది ఆమెను పదవి నుంచి దించేయాలని కోరుతూ సంతకాలు చేశారు.ఆదివారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో మొదట రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలోనూ, అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలోనూ టీడీపీ నేతలు సమావేశమయ్యారు. ఇద్దరు డిప్యూటీ మేయర్లతోపాటు టీడీపీకి చెందిన సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ముఖ్యనేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం 11 గంటలకు వారు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నోటీసు అందచేయనున్నారు.

● పలు ఆరోపణల నేపథ్యంలో...

మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్‌పై పలు ఆరోపణలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఆమెను పదవి నుంచి దించేయాలని తొలుత భావించారు. అయితే నాలుగేళ్లపాటు అవిశ్వాసం పెట్టేందుకు వీలు లేకపోవడంతో అధికార పార్టీ నేతలు ఇప్పటి వరకు ఎదురు చూశారు. గత వైసీపీ హయాంలో జయవర్ధన్ మార్టిగేజ్ నిధుల విడుదల్లో అప్పటి కమిషనర్ ఐఏఎస్ అధికారి సంతకాన్నే ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఆయన జైలు జీవితం కూడా అనుభవించారు. రూ.కోట్లు కుంభకోణం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు కూడా తేల్చారు. ఆపై మరో ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా వచ్చారు. ఆయన సీసీని గదిలోపెట్టి తలుపేసి బంధించారు. ఈ క్రమంలో జయవర్ధన్ రెండోసారి జైలుకు వెళ్లారు. కాగా మేయర్ పేషీ ఖర్చుల పేరిట రూ. లక్షలు డ్రా చేసి లెక్కలు చూపలేదన్న విమర్శలను మేయర్ దంపతులు ఎదుర్కొన్నారు. కార్పొరేషన్ సమావేశాల్లో భోజనం ఖర్చుల పేరిట రూ. లక్షల బిల్లులను వారు బినామీల పేరుతో డ్రా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని టీడీపీ నిర్ణయించింది.

తదుపరి మేయర్ ఎవరు ?

మేయర్ స్రవంతిపై అవిశ్వాసం నెగ్గితే, తదుపరి మేయర్ ఎవరన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది. మేయర్ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. 54 మంది కార్పొరేటర్లలో ఎస్టీలకు మూడే సీట్లున్నాయి. 12వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న స్రవంతి ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్నారు. కాగా 53వ డివిజన్ కార్పొరేటర్ సుజాత, 5వ డివిజన్ కార్పొరేటర్ రవిచంద్ర ఎస్టీలే. వీరిద్దరిలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. సుజాతకు ఎక్కువ అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇద్దరు డిప్యూటీ మేయర్లలో ఒకరికి ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం ఉంది.

కార్పొరేటర్ స్థానాల పెంపు

నగరంలో 17 కార్పొరేటర్ స్థానాలను పెంచేందుకు మంత్రి పొంగూరు నారాయణ సంకేతాలిచ్చారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన సూచనప్రాయంగా ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలో 54 స్థానాలుండగా, వాటిని 71కి పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. కోఆప్షన్ సభ్యులు ఐదుగురు ఉండగా, ఆ స్థానాలు 8కి పెరిగే అవకాశాలున్నాయి. మరో ఏడాది లేదా అంతకన్నా ముందే (రాష్ట్ర వ్యాప్తంగా) ఎన్నికలు వచ్చే అవకాశాలుండటంతో మంత్రి ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా మరికొంతమంది నగర నేతలకు పదవులు లభించనున్నాయి.

● వైసీపీలోనూ భంగపాటు

తనను మేయర్ పదవి నుంచి అవిశ్వాసం ద్వారా దించేయాలని టీడీపీ చూస్తున్నదని, తనకు మద్దతుగా నిలవాలని మేయర్ స్రవంతి దంపతులు వైసీపీ నేతలను కోరారు. కానీ అక్కడ కూడా వారికి భంగపాటే ఎదురైనట్లు తెలిసింది.



ఉదయగిరి మండలం గండిపాళెంలో జోరుగా కురుస్తున్న వర్షం

మళ్లీ వానలు

● అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షం

● మెట్ట ప్రాంతంలో జోరు

● నేడు కూడా కొనసాగే అవకాశం

● ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి : ఎస్పీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలోని దక్షిణ అండమాన్ వద్ద ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం వర్షం కురిసింది. ఉదయం వర్షం పడినా, మధ్యాహ్నం ఎండకాసింది. జిల్లాలో 6.4 మి.మీల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాపూరులో 53.6 మి.మీ, అత్యల్పంగా కోవూరులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.అల్పపీడన ప్రభావంతో సోమవారం కూడా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

● మెట్టలో జోరు వర్షం

ఉదయగిరి రూరల్ : మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి చిరుజల్లులు పలకరించినా, ఉదయం నుంచి ఏకతాటిగా 3 గంటల పాటు వర్షం కురిసింది. అంతేకాక చలి గాలుల ప్రభావం అధికమవడంతో పిల్లలు, వృద్ధులు బెంబేలెత్తిపోయారు. రైతులతోపాటు మూగజీవాల యజమానులకు వర్షంతో ఊరట కలిగింది.

● ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి

నెల్లూరు(క్రైం) : పెన్నా పరివాహక ప్రాంత, తీర మండలాల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని పోలీసు అధికారులను ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. రానున్న 4,5 రోజుల్లో జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సోమశిల నుంచి నీరు కిందకు విడుదల చేయనున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి ఆదివారం 27,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి నీటి విడుదల పెరుగుతూ ఉంటుందని, దిగువన ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

డ్యాముల్లో నిండుగా..

● సోమశిలకు 18,500 ఇన్‌ఫ్లో

అనంతసాగరం : సోమశిల ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 18,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులో 75.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 500, డెల్టాకు 27,300, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో 57.08 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.08 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 550 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 980 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

● 18వేల క్యూసెక్కుల ప్రవాహం

సంగం : సంగం బ్యారేజ్‌కి సోమశిల నుంచి ఆదివారం సుమారు 18 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరుతుంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటి మట్టం 11 అడుగులకు స్థిరీకరించారు. 5 గేట్లు ఎత్తి దిగువ నెల్లూరు బ్యారేజ్‌కి నీటిని విడుదల చేసున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

పాదర్శకతకు పంగనామం

● ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు కాని ఈ-ఆఫీస్

● టెక్నాలజీని అందిపుచ్చుకోని అధికారులు

● కొన్ని శాఖల్లో అరకొర.. మరికొన్నింటిలో నిల్

● మ్యాన్యువల్ విధానంలో ఇంజనీరింగ్ శాఖల్లో ఆడిందే ఆట !

ఫైళ్లు మాయం.. ఆలస్యం.. సిబ్బంది నిర్లక్ష్యం



నెల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ పెరిగే కొద్దీ పనితీరులో వేగం, పారదర్శకత పెరగాల్సింది పోయి, ప్రభుత్వ శాఖలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పారదర్శక పాలన కోసం ప్రతీ ప్రభుత్వ శాఖ ఈ-ఆఫీస్ విధానాన్ని పాటించాలని ప్రభుత్వం పదే పదే ఆదేశిస్తున్నది. అయితే ఇంకా పలు శాఖలు ఆ వైపు చూడడం లేదు. కొన్ని శాఖలు ఈ-ఆఫీస్‌ను ఉపయోగిస్తున్నామంటే ఉపయోగిస్తున్నాం.. అన్న తీరున వ్యవహరిస్తున్నాయి. కొన్నిశాఖలు ఇంకా కూడా మ్యాన్యువల్‌గానే పాలన సాగిస్తున్నారు. దీని ఫలితంగా ప్రభుత్వం ఆశించినంత వేగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్ జరగడం లేదు. పైపెచ్చు మాన్యువల్ విధానంలో కొన్ని ఫైళ్లు మాయమవుతున్నాయి.అదే సమయంలో జవాబుదారీతనం లేకుండా పోతున్నది. ఏ ఫైల్ ఎక్కడుందో తెలుసుకోవడం కూడా కష్టంగా మారింది. ఇక అక్రమాలకు కూడా అడ్డుకట్ట పడడం లేదు. ఈ-ఆఫీస్ విధానంలో అయితే ఒకసారి సంతకం చేసిన ఫైల్‌ను మార్చేందుకు వీలు కుదరదు. కానీ మాన్యువల్ ఫైల్స్ కావడంతో తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అధికారులు, సిబ్బందికి అవకాశం ఉంది.

● కలెక్టర్ ఆదేశించినా..

మాన్యువల్ ఫైల్ విధానంలో మరో ప్రధానమైన సమస్య సమయం వృథా కావడం. ఒక సీటు నుంచి లేదా ఒక కార్యాలయం నుంచి మరో చోటకు ఫైల్ తీసుకెళ్లే విషయంలో జాప్యం జరుగుతోంది. ఒక ఉద్యోగికి ఇదే పనిగా మారుతోంది. అదే సమయంలో కాన్ఫిడెన్షియల్ ఫైల్స్ సమాచారం బయటకు వస్తోంది. కలెక్టర్ లేదా జేసీ పంపే ఫైల్స్‌ను సదరు శాఖ అధికారులు నేరుగా తీసుకొచ్చి కలెక్టర్ సమయం ఇచ్చే వరకూ కలెక్టరేట్‌లో ఎదురుచూస్తుంటారు. ఈలోపు ఆయా అధికారుల కోసం వారి కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, సామాన్యులకు ఎదురుచూపులు తప్పవు. ఈ పరిస్థితులను అధికమించడానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రతీ శాఖ ఈ-ఆఫీస్‌ను అనుసరించాలని ఆదేశాలిచ్చారు. తనకు పంపే ఫైల్స్‌ను తాను చెబితే తప్ప మిగతా సమయంలో ఈ-ఆఫీస్‌లోనే పెట్టాలని ఆదేశించారు. కానీ ఇప్పటికీ కీలకమైన శాఖలు కూడా ఈ-ఆఫీస్‌లో ఫైళ్లు నడపకపోవడం గమనార్హం.

● ప్రజలకు కష్టం.. ప్రభుత్వానికి నష్టం

ప్రస్తుత కాలంలో ప్రైవేటు సేవలు వేగంగా అందుతున్నాయి. డోర్ డెలివరీ చేసే దశకు సమాజం అభివృద్ధి చెందితే.. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం ప్రజలు నేరుగా వెళ్లి కాళ్లరిగేలా తిరుగుతున్నా పనులు ఒక పట్టాన జరగడం లేదు. వేగంగా సేవలందించే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ శాఖలో కచ్చితంగా ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఆ తర్వాత పట్టించుకోలేదు. ఆయా శాఖల అధికారులు కూడా దాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ ప్రభావం ప్రజా సమస్యల పరిష్కారంపై పడుతుండడంతో అది ప్రభుత్వానికి నష్టాన్ని కలిగిస్తోంది. ఒక భూ సమస్యపై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరే వరకూ ఎన్ని తంటాలు పడాలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ దశలో ఎవరి దగ్గర ఫైల్ ఉందో..? ఎందుకు ముందుకు కదలడం లేదో..? అన్న విషయాన్ని తెలుసుకునేందుకు కూడా అర్జీదారుడు అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలి. ఇక తీరా ఆర్డీవో కార్యాలయానికో లేక కలెక్టరేట్‌కో ఫైల్ వస్తే అక్కడ గుంపులో కలిసిపోతోంది. ఉన్నతాధికారులు ఈ ఫైల్ గురించి ప్రత్యేకంగా అడిగినప్పుడు వెతుకులాట ప్రారంభిస్తున్నారు. ఇక ఆ సీటు చూసే ఉద్యోగి బదిలీ అయ్యారంటే ఆ ఫైల్‌ను వెతికి పట్టుకోవడం ఒక సాహసంగానే చెప్పవచ్చు.

● ఇంజనీరింగ్‌శాఖలో విచ్చలవిడితనం

ఇంజనీరింగ్ శాఖల్లో అయితే ఈ-ఆఫీస్ లేకపోవడంతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ శాఖలో ఓ టెండర్‌కు సంబంధించి నిబంధనను మార్చాలని ఓ ఉన్నతాధికారి సిబ్బందిని ఆదేశించారు. అయితే అది నిబంధనలకు విరుద్ధమని సిబ్బంది చెప్పినా, వారిపై ఒత్తిడి తెచ్చి మరీ మార్పించారు. ఇదంతా మాన్యువల్ ఫైల్ కావడంతోనే జరిగింది. అదే ఈ-ఆఫీస్ అయితే ఎందుకు నిబంధన మార్చాల్సి వచ్చిందో సదరు ఉన్నతాధికారి అక్కడ రిమార్కులు రాయాల్సి ఉంది కాబట్టి తప్పు చేసేందుకు సాహసించరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.1.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగనాయకులపేటలో వెంకటమ్మ పేరంటాలు ఆలయ రాజగోపురం మహామండపం, ఇతర అభివృద్ధి పనులకు ఆదివారం సాయంత్రం భూమిపూజ జరిగింది. రూ.1.15 కోట్లతో మూడంతస్తుల రాజగోపురం, మహా మండపం నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవదాయ శాఖ జిల్లా ఏసీ జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో మోహన్ కుమార్ పాల్గొన్నారు.

రైతన్నా... మీకోసం...!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాల్సిది. ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా అడుగులు వేస్తున్నది. ఈనేపథ్యంలో సోమవారం (నేటి) నుంచి రైతుల ఇంటింటికే వెళ్ల 'రైతన్నా.. మీకోసం' అంటూ ఐదు విధానాలతో కార్యాచరణ అమలుపై అన్నదాతలకు అవగాహన కల్పించనున్నది.

● నేటి నుంచి వారం రోజులు ప్రత్యేక కార్యక్రమం

● లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం

● ఒక్కో ఆర్ఎస్‌కే పరిధిలో ఒక్కొక్క టీం




నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, దాని అనుబంధరంగాలు, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలు రాష్ట్ర జీడీపీలో 35శాతం వాటా అందిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. 2047 నాటికి మరో 15శాతం వృద్ధి రేటు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. అలాగే మరో ఐదేళ్లలో రైతుకు మరింత ఆదాయం తెచ్చిపెట్టేలా అడుగులు వేయించాలని ఐదు విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నది. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఇందులో నీటి భద్రత ఎంతో ముఖ్యం. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంలో భాగంగా అసంపూర్తి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి, నీరు నింపడం. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతల సాగు పద్ధతుల్లో మార్పు. పంట మార్పిడి పాటించడం, చిరుధాన్యాల సాగు పెంచడం, ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున చేపట్టడం. ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఇవ్వడడంతోపాటు ప్రభుత్వ పథకాలు అందించడం. డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యం విస్తరణ, ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలు అందించడం, ఇంకా కిసాన్ డ్రోన్‌సేవలు అందించడం, యంత్రాలు, టెక్నాలజీ వాడుకతో వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించడం, పంటల ఆరోగ్యస్థితి అంచనా వేయడానికి శాటిలైట్ టెక్నాలజీ వాడకం. రైతుల పంటలకు విలువ పెంచుకునేందుకు ఇప్పటికే రూ.13వేల కోట్లతో 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో ఎంవోయూ కుదుర్చుకోవడం, ఇంకా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం.కిసాన్ పథకం కింద మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20వేలు అందించడం, పీఎం ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలు అమలు, మద్దతు ధర కల్పించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం.

● ఒక్కో ఆర్ఎస్‌కే పరిధిలో ఒక్కొక్క బృందం

రైతన్నా.. మీకోసం కార్యక్రమ అమలుకు ఒక్కో రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే) పరిధిలో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సచివాలయం సిబ్బంది ఉండగా, వారికి గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పశుసంవర్ధకశాఖ సహాయకులు, గ్రామ మత్స్య సహయకులు, గ్రామ ఉద్యాన సహాయకుల బృందం నాయకత్వం వహిస్తారు. మండల వ్యవసాయాధికారులు, మండల పశువైద్యులు, మత్స్య అభివృద్ధి అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఆయా ఆర్ఎస్‌కే పరిధిలో ఎంతమంది అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించిన నగదు అందుతుందో..? వారి కుటుంబాలను పలకరించడం, ప్రభుత్వ పథకాలపై కొన్ని ప్రశ్నలు వేయడం, వారు చెప్పే సమాధానాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి, ఫొటో దిగడం చేస్తారు. ఇకపోతే సీఎం చంద్రబాబు సందేశంతో కూడిన కరపత్రం ఇస్తారు. ఆయా గ్రామాల పరిధిలో పరిస్థితులు, రైతుల అవసరాలపై ఆరా తీస్తారు. ఇలా వారం రోజులు కార్యక్రమం నిర్వహిస్తారు. డిసెంబరు 3న రైతులతో వర్క్‌షాపు నిర్వహిస్తారు.

హమ్మో.. వానరాలు!

కావలిలో కోతుల బెడద



కావలి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కావలి టౌన్‌లో కోతుల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. తలుపులు తీస్తే ఇళ్లలోకి చొరబడేందుకు గోడలపై వానరాలు సిద్ధంగా ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. చేతిలో కర్ర లేకపోతే దాడి చేసి మరీ.. ఇళ్లలోకి వెళ్లి సామాన్లు తీసుకెళుతుండటంతో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. కోతుల సమస్యపై ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో కోతులను పట్టుకున్నవారికి బిల్లులు ఇంకా ఇవ్వకపోవటంతో.. ఇప్పుడు ఎవరూ వాటిని పట్టుకునేందుకు ముందుకు రావడం లేదని సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 660

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,881

వెండి కిలో ధర రూ. 1,58,400

వెండి ఒక గ్రాము రూ.163.40

ఘనంగా అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం నగరంలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేసి, దుస్తులు, దుప్పట్లు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో నాగార్జున ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు మధు, నాయకులు రమేష్, ఎస్‌కే.రహీం, బీ.మురళి, అక్కినేని నాగార్జున, నాగచైతన్యల ఫ్యాన్స్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజలకు అండగా కమ్యూనిస్టులు

నెల్లూరురూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాలు, పీడిత ప్రజలకు నాడు, నేడు అండగా నిలిచి భరోసా నిచ్చేది కమ్యూనిస్టులేనని ఆ పార్టీ సీనియర్ నేత మోహన్ రావు తెలిపారు. ఆదివారం మండలంలోని సౌత్‌మోపూరులో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో తొలిసారిగా రష్యాలో లెనిన్ నాయకత్వాన 1917 అక్టోబరు 25వ తేదీన కమ్యూనిస్టు ప్రభుత్వం ఆవిర్భవించిందని తెలిపారు. అదే స్ఫూర్తితో అనేక దేశాల్లో, భారత్‌లోని అనేక రాష్ట్రాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పడి నేటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. అమెరికాలోనూ ప్రజలు కమ్యూనిస్టు నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జనార్దన్, నాయకులు తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



మోహన్(ఫైల్)

నెల్లూరు(వైద్యం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఆలూరి మోహన్(56) ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. ఆయన భార్య ఆలూరి సుశీల, కుమారుడు ఆలూరి కిరణ్ అంగీకారంతో మృతుడి నేత్రాలను టెక్నీషియన్ సునీల్ సేకరించారు. నేత్రదాన సర్టిఫికెట్‌ను కుటుంబ సభ్యులకు అందచేశారు. నేత్రదానం చేయాల్సిన వారు 9959589321ను సంప్రదించాలని టెక్నీషియన్ కోరారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

నెల్లూరు(విద్య), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎన్‌సీసీ కేడెట్స్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను కూడా వారే పరిరక్షించాలన్నారు. కేడెట్స్ క్రమశిక్షణతో సాధన చేసి విద్యలో రాణిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్, ఎన్‌సీసీ అధికారి ధనుంజయరావు, ఉపాధ్యాయులలు చంద్రశేఖర్, అంకయ్యచౌదరి, జనార్దన రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● సీఐ శివరామకృష్ణారెడ్డి



సీఐ శివరామకృష్ణారెడ్డి

పొదలకూరు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): రానున్న నాలుగైదు రోజుల పాటు భారీ వర్ష సూచనల నేపథ్యంలో సోమశిల రిజర్వాయర్ నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేస్తున్నందున మండలంలో పెన్నా నది పరీవాహక ప్రాంత గ్రామాలైన సూరాయపాలెం, విరువూరు, మహమ్మదాపురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణారెడ్డి సూచించారు. సోమశిల రిజర్వాయర్ నుంచి 27,300 క్యూసెక్కుల నీటిని పెన్నానదికి విడుదల చేశారని, రిజర్వాయర్‌కు వచ్చే ఇన్‌ఫ్లోను బట్టి అది పెరగవచ్చన్నారు. సూరాయ పాలెం, విరువూరు, మహమ్మదాపురం గ్రామాల పశువుల కాపర్లు, రైతులు నదివైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

ముగిసిన జాతీయ సేవా పథకం క్యాంపు

ఇందుకూరుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులచే గత ఏడు రోజుల నుంచి జరిగిన జాతీయ సేవా పథకం ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజేష్ మాట్లాడుతూ శిబిరం ద్వారా తెలుసుకున్న సామాజిక విలువలు భవిష్యత్తులో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మధుసూదన్, సుబ్రహ్మణ్యం, చెంచు కిషోర్‌యాదవ్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసుల అభివృద్ధికి పాటుపడతాం

పొదలకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసుల అభివృద్ధికి చేయూతనందిస్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రెద్దుల సురేష్ అన్నారు. ఆదివారం పొదల కూరులో ట్రైబల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా బాల కోటయ్య, జిల్లా అధ్యక్షులుగా రమణయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా శివకుమార్, కోశాధికారిగా తిరుమలశెట్టి మనెమ్మను ఎన్నుకుని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

పొదలకూరు తాలూకా ఎన్జీవో ఎన్నికలు ఏకగ్రీవం

పొదలకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎన్జీఓ అసోసియేషన్ పొదలకూరు తాలూకా ఎన్నికలు స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా రాపూరు తాలూకా అధ్యక్షుడు తోట మల్లికార్జునరావు, సహాయ ఎన్నికల అధికారిగా నల్లగండ్ల మధు, ఎన్నికల పరిశీలకులుగా ఈదూరు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. 11 పోస్టులకుగాను 11 మంది నామినేషన్లు వేయగా పరిశీలనానంతరం ఈకింద వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా కె.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.షాన్‌వాజ్, బి.రాజమోహన్, ఎం.వెంగయ్య, కార్యదర్శిగా నేలపాటి చిరంజీవులు, సంయుక్త కార్యదర్శులుగా ఎ.రవీంద్రబాబు, ఎస్.వినోద్‌కుమార్, జె.మాధవరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎం.రాధాకుమారి, కోశాధికారిగా కె.కామాక్షి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పూజ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ముందు స్థానిక అయ్యప్ప దీక్షాపరుల అధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి, పడి(మెట్లు)పూజ భక్తులను అలరించింది. ముందుగా అరటి బోదలతో వేదికను తయారు చేశారు. ఆ వేదికపైన అరటి బోధలతోనే 3 మందిరాలు ఏర్పాటు చేసి ఆ మందిరాలలో శ్రీ విఘ్నేశ్వరస్వామి, శ్రీ అయ్యప్పస్వామి, శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వారిని కొలువుదీర్చి స్వామివార్లకు చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ, మెట్లుపైన దీపాలు ఎంతో ఆకర్షణీయంగా చేశారు. అయ్యప్ప దీక్షాపరులు ఆలపించిన భక్తి పాటలు అలరించాయి. అనంతరం దీక్షాపరులతో పాటు అందరికీ అన్న ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంతోపాటు ఇతర మండలాలనుంచి వచ్చిన అయ్యప్ప దీక్షా పరులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రారంభానికి నోచుకోని ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయ భవనం

మంత్రే ప్రారంభించాలట..!

● నిరుపయోగంగా ఔషధ నియంత్రణ శాఖ నూతన భవనం ● కార్యాలయానికి రూ.వేల అద్దె చెల్లింపు

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ఈ భవనం ప్రాంభించాలట.. అందుకే ఆలస్యమైందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. నగరంలో ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ నుంచి రూ.90 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో చేపట్టిన భవన నిర్మాణం అన్ని హంగులతో 6 నెలల క్రితమే పూర్తయింది. అయినా ఇంతవరకు ఈ భవనం ప్రారంభం కాకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో ఈ కార్యాలయంలో సామగ్రి అంతా తుప్పు పడుతోంది. వాస్తవానికి రాష్ట్రంలో ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయాలు పెద్ద సంఖ్యలో నిర్మించారు. నెల్లూరుతో పాటు మిగిలిన జిల్లాల్లో ఈ కార్యాలయాలు పూర్తయినా అవన్నీ నేటికీ ప్రారంభించలేదని తెలిసింది. విశాఖపట్నం కేంద్రంగా మిగిలిన ఔషధ నియంత్రణ కార్యాలయాలను వర్చువల్‌గా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నెల్లూరు జీజీహెచ్ ప్రాంగణంలోని ఆ కార్యాలయం ఎప్పుడు ప్రారంభిస్తారో, అసలు ఎందుకు ప్రారంభించడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల వచ్చిన తుపాను కారణంగా ఈ ప్రారంభోత్సవాలు ఆలస్యమయ్యాయని అధికారులు చెబుతున్నారు. అయితే 6 నెలలు ఎందుకు పట్టిందన్న విమర్శలు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వేల రూపాయలు ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి అద్దె రూపంలో చెల్లిస్తుంది. ఇంత మొత్తంలో ప్రతీ నెల చెల్లిస్తున్నా సొంత భవనంలోకి వెళ్లేందుకు ఎందుకు ఆలస్యమవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో సిగ్నల్ పడింది!

● నాలుగు ప్రాంతాల్లో అందుబాటులోకి... ● ప్రారంభించిన మంత్రి పొంగూరు, ఎంపీ వేమిరెడ్డి



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, తదితరులు

నెల్లూరు(సిటీ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎప్పట్నుంచో ఇదిగో.. అదిగో.. అంటున్న ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ రానే వచ్చింది. ఆదివారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎస్పీ అజిత వేజెండ్లలు నాలుగు ప్రాంతాల్లో నూతన ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రూ.1.39 కోట్లతో నగరంలో సిగ్నల్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామన్నారు. హరనాథపురం, రామలింగాపురం, వీఆర్సీ కూడలి, కనకమహల్ సెంటర్ వద్ద తొలత ఈ సిగ్నల్ విధానం అమల్లోకి తెచ్చామన్నారు. మరో మూడు ప్రాంతాలలో త్వరలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. నగర వాసులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తూ.చ. తప్పక పాటించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ట్రాఫిక్ నియంత్రణ జరుగుతుందని తెలిపారు. నగరంలో ప్రజలకు అవసరమైన అన్నీ సౌకర్యాలను ఒక్కొక్కటిగా సమకూర్చుతున్నట్లు తెలిపారు. జరుగుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు స్థలం పరిశీలన : నెల్లూరు-నరుకూరు రహదారిలో నూతన మార్కెట్ యార్డును ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ మేరకు అధికారులతో కలిసి ఆయన స్థల పరిశీలన చేశారు. ఆధునిక టెక్నాలజీతో ఈ యార్డు నిర్మాణం ఉంటుందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రత్యేకించి నెల్లూరులోనే ఈ నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. యార్డు స్థలం పరిశీలలోనే బ్లూ ప్రింట్ ద్వారా అధికారులకు పలు ఆదేశాలు, సలహాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రజలకు అవసరమైన అన్ని వస్తు సామగ్రి ఒకే చోట అందుబాటులో ఉంటుందని తెలిపారు.

బలవంతంగా కారు తీసుకెళ్లడంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కారు షెడ్డు నుంచి బలవంతంగా కారును తీసుకెళ్లారని ఇచ్చిన ఫిర్యాదుపై చిన్నబజారు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు నగరంలోని కోటమిట్ట నెక్లస్‌రోడ్డు ప్రాంతంలో షేక్ షఫీ అహ్మద్ నివాసం ఉంటున్నారు. ఆయన ఇరుగాళమ్మ ఆలయం సమీపంలోని ఓ కార్ షెడ్డులో పని చేస్తున్నారు. కోటమిట్ట ప్రాంతానికి చెందిన మసూద్, ఖైజర్, అబ్దుల్ హఫీజ్, షారుక్‌లు అప్పుడప్పుడు కార్ షెడ్డుకు వచ్చి అద్దెకు కార్లు తీసుకొని వెళతుంటారు. ఈ క్రమంలోనే ఈనెల 22వ తేదీన ఆ నలుగురు పూటుగా మద్యం సేవించి కార్‌షెడ్డుకు వచ్చి కారు బాడుగకు కావాలని అడిగారు. షెడ్డులో ఉన్న షఫీ అహ్మద్ కారు లేదని చెప్పడంతో కారు ఇస్తావా లేకుంటే నిన్ను చంపమంటావా అంటూ బెదిరిస్తూ షెడ్డులో ఉన్న షిఫ్ట్ కారును బలవంతంగా తీసుకెళ్లారు. ఈ విషయాన్ని అహ్మద్ కారు ఓనర్ షయాజ్‌కు తెలిపాడు. బలవంతంగా కారు లాకెళ్ల డంపై ఇద్దరు ఆదివారం చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నేతలు

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ 2025లో ఉద్యోగాలు సాధించిన బీసీ ఉపాధ్యాయులను బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నగరంలోని మాగుంటలేఅవుట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు మాట్లాడుతూ డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు నిబద్దతతో విధులు నిర్వహించాలన్నారు. ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థుల ఉన్నతికి నిరంతరం పాటుపడాలన్నారు. ప్రభుత్వం కూడా బీసీల రిజర్వేషన్ శాతం పెంచి మరింత ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 150 మంది ఉపాధ్యాయులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిలి సురేష్, కార్యదర్శి వేములపాటి మాదవ, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రవి, ప్రధాన కార్యదర్శి చెన్నుకృష్ణ, భువనేష్ లైఫ్ స్పేసెస్ ఎండీ కాకు బాబూరావు, సీఈవో ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల పట్ల నిర్లక్ష్యం తగదు

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదని అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రఫీద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని మన్సూర్ భవన్‌లో బుఖారి సాహెబ్ అధ్యతన జరిగిన అవాజ్ రూరల్ 5వ మహాసభలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టీలు విద్యకు దూరమై కూలీలుగా, మెకానిక్‌లుగా మారుతున్నారన్నారు. అవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ మాట్లాడుతూ షాదీముబారక్ తోఫా పథకం అమలు చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధిలో షాదీమంజిల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అక్కచెరువుపాడు వద్ద ముస్లిం బాలికల కోసం నిర్మిస్తున్న గురుకుల పాఠశాలను వెంటనే నిర్మించాలన్నారు. ఈ మహాసభలో మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, పాల్గొన్నారు. అనంతరం 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సత్యసాయిబాబా సేవలు శాశ్వతం : నుడా చైర్మన్

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : కలియుగ దైవంగా మానవాళికి ఎనలేని సేవ చేసిన ఆధ్యాత్మిక విశ్వగురువు, సేవాతత్వాన్ని ప్రేమతత్వాన్ని ప్రపంచానికి చాటిన సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌనుహాలులో భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సత్యసాయిబాబా జీవిత చరిత్రపై కవి సమ్మేళనం జరిగింది. అనంతరం భగవాన్ సత్యసాయి పురస్కార గ్రహీతలు డాక్టర్ పావులూరు శ్రీనివాసులు, డాక్టర్ జీవీవీ ప్రసాద్‌రెడ్డి, కుండా భాస్కర్, నాగిరెడ్డి విజయనిర్మల, మీసాల వజ్రమ్మ, ఆసూరి రాఘవాచార్యులు, తెనాలి శ్రీహరిస్వామి, తిరుమలశెట్టి లక్ష్మీనారాయణ, మల్లికార్జునస్వామి, త్యాగరాజు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, పూనిపర్తి పవన్‌రాజ్, కూని అంకబాబులను శాలువా, పూలమాల, మెమొంటో, మెడల్, కిరీటధారణతో ఘనంగా సత్కరించారు. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, చామకూరు హరిగోపాల్, డాక్టర్ కే.పెంచలరెడ్డి, డాక్టర్ లలితా షిర్డిషా, కొండూరు హరినారాయణరెడ్డి, కే.మురళీమోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

● గోమతినగర్ సత్యసాయి మందిరంలో శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, అభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో నామ సంకీర్తనతో స్వామి ప్రసాదాలు పంపిణీ, పేదలకు వస్త్రదానం, మద్రాసు బస్టాండ్ వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయిహృదయలో వీణ కచ్చేరి, భజనతో పాటు స్వామివారికి ఉయ్యాల ఉత్సవం, మహా మంగళహారతులు నిర్వహించారు. మందిర గౌరవ అధ్యక్షుడు మురళీకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వారి ప్రసాదాలు స్వీకరించారు. మందిర కన్వీనర్ కొండా శేషగిరిరావు, జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జ్ నాగలక్ష్మి, యూత్ కో ఆర్డినేటర్ రాజశేఖర్, బాలవికాస్, ఇన్‌చార్జ్ గాయత్రి, మహిళా సేవాదళ్ రాజీ, తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు సత్యసాయి పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): తెలుగు భాష, సంస్కృతి ప్రాచుర్యానికి పాటుపడుతున్న బుచ్చి మున్సిపాలిటీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ సత్యసాయి సాహిత్య సేవా పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, గజల్ శ్రీనివాస్ చేతులమీదుగా అవార్డు అందుకున్న ఆయనను ఎంఈఓలు దిలీప్ కుమార్, పీవీ రత్నం అభినందించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమతో పేదలకు ఉపాధి

● ఎమ్మెల్యే సోమిరెడ్డి



పరిశ్రమను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమతో పేదలకు ఉపాధి దొరుకుతుందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో ఆదివారం శ్రీ వినాయక ఏజెన్సీస్ పేరిట నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ఎస్ఆర్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పరిశ్రమ ఎండీ మేడికొండ శ్రీహరినాయుడు, రామానాయుడులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. పరిశ్రమలోని యంత్రాలు, ముడి సరుకును ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమతో పేదలకు ఉపాధితో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి పరిశ్రమ నిర్వహణకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తిరుపతి శాప్ చైర్మన్ ఏ. రవినాయుడు, తిరుపతి గంగమ్మ గుడి అధ్యక్షుడు మహేష్‌యాదవ్, జిల్లా ఇండస్ట్రీయల్ అధికారి శివశంకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలా ధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి, మధునాయుడు, కోదండ రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, ప్రసాద్, సాని వెంకటరమణయ్య, కిరణ్ కుమార్, రాజా గౌడ్ పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) ప్రజలందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇనమడుగు గ్రామంలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం యూనివర్సల్ హెల్త్‌పాలసీ పథకానికి సీఎం శ్రీకారం చుట్టనున్నారని చెప్పారు. శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ నుంచి భవన నిర్మాణానికి రూ. 1.98 కోట్లు సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయించారని చెప్పారు. కోవూరులో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, స్థానిక వైద్యాధికారి నిరంజన్, జొన్నవాడ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, మండల టీడీపీ ఇన్‌చార్జ్ నల్లపరెడ్డి సురేష్ రెడ్డి, వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి, ఎంపీటీసీ సునీల్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాకసిరి వెంకట రమణమ్మ, టీడీపీ నాయకులు జెట్టి మదన్‌రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, చింతలపూడి వెంకయ్య పాల్గొన్నారు.

సమస్యల నిలయాలు.. ఆర్టీసీ బస్టాండ్లు!



చెరువును తలపిస్తున్న పొదలకూరు ఆర్టీసీ బస్టాండు

పొదలకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పంచాయతీ బస్టాండు, కొత్త బస్టాండు (ఆర్టీసీ బస్టాండు)లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రయాణి కులకు కనీస వసతులు కూడా లేవు. ప్రయాణికులు వేచి ఉండే పలు ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. అక్కడక్కడ నామమాత్రంగా కనిపించే బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా ప్రయాణికులు మండుటెండలో నిలబడుతున్నారు. వర్షం వస్తే దుకాణాల ఎదుట తలదాచుకోవడంతో యజమానులు వారిని అక్కడ కూడా ఉండనివ్వడంలేదు.

● ప్రధాన కూడళ్లలో...

ప్రధాన కూడళ్లలో వాహనాలు వచ్చేంత వరకు ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు లేవు. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల రాక కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు పరిస్థితి మరీ దారుణం. దుస్తులతోపాటు పుస్తకాలు తడిసిపోతుండడంతో ఇబ్బందిపడుతున్నారు. పొదలకూరు గేట్ సెంటర్‌లోనూ, సంగంరోడ్డు కూడలి వద్ద, పంచాయతీ బస్టాండులో నెల్లూరు బస్సులు ఆగే ప్రదేశంలోనూ బస్ షెల్టర్లు లేక అవస్థలు పడుతున్నారు. చుట్టుపక్కల మండల ప్రజలు సొంత పనులపై పట్టణానికి వస్తుంటారు. రోజూ 20 వేల మంది వరకు పట్టణంలో వివిధ పనులు ముగించుకుని స్వగ్రామాలకు వెళ్లేందుకు పలు కూడళ్లలో బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు.

● ఎక్కడెక్కడంటే...

పట్టణంలోని గేట్ సెంటర్, పంచాయతీ బస్టాండు నెల్లూరు బస్సులు ఆగే చోట, సంగం బస్సులు ఆగే చోట, సంగం రోడ్డు పెట్రోలు బంకు కూడలి వద్ద ఆయా మార్గాల్లోని కూడళ్లలో బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు వేచి ఉంటారు. ఇక్కడ ఎలాంటి నీడ వసతి లేదు. మహిళలు టాయిలెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్లు నిర్మిస్తే ప్రయాణికులకు వసతిగా ఉంటుంది. స్త్రీశక్తి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో బస్ షెల్టర్లు నిర్మించి వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● చెరువులా ఆర్టీసీ బస్టాండు

పొదలకూరు ఆర్టీసీ బస్టాండు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నపాటి చెరువును తలపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కూటమి నాయకులు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్న ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బస్టాండులో వర్షం పడితే నీరు నిల్వకుండా సిమెంటు రోడ్డు వేయాల్సి ఉంది.

సత్యసాయి శత జయంత్యుత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణా నగర్‌లోని మహాగణపతి, గాయత్రి మాత సమేత భగవాన్ పుట్టపర్తి సత్యసాయి సుందరేశ్వర నిలయంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. వినాయకుడు, గాయత్రిమాత, శివలింగం, శ్రీ సత్యసాయిబాబా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పలువురు సత్యసాయిబాబా భక్తులు పాటల రూపంలో ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అండగుండ వెంకటసుబ్బారావు దంపతులు, కన్వీనర్ పోలిశెట్టి వినోద్ దంపతులు, కుటుంబ సభ్యులు ఇనుగూరు బాలయ్య, ఎన్‌వీ రమణయ్య, రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కాకాణీ.. మాట్లాడే పద్ధతి మార్చుకో!



మాట్లాడుతున్న మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోకపోతే కనుమరుగైపోవడం ఖాయమని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ హెచ్చరించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీసీ నాయకుడు ముత్యం గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సంస్కారం లేకుండా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నన్నం దీనయ్య, ఉపాధ్యక్షుడిగా దారా యాదగిరి, పట్టపు శోభన్, ప్రధాన కార్య దర్శిగా కాల్తూరి రవి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడిగా వావిళ్ల జనార్ధన్, కార్య దర్శిగా లక్ష్మీప్రసాద్‌లను ప్రకటించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మార్పిరెడ్డి శేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు శివకృష్ణ, బొలిగర్ల శ్రీనివాసులు, ఏడు కొండలు, అనీల్‌రెడ్డి, పాల్గొన్నారు.

కావలి ఐఎంఏకి రాష్ట్రస్థాయి అవార్డులు



అవార్డు అందుకుంటున్న సుబ్బారావు, గోపీ

కావలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. కావలి ఐఎంఏ శాఖకు బెస్ట్‌సెక్రటరీ, బెస్ట్ సోషల్ సర్వస్ అవార్డులను రాష్ట్ర ఐఎంఏ ప్రకటించింది. అన్నమయ్య జిల్లా రాజంపేటలో శనివారం రాత్రి జరిగిన ఐఎంఏ 67వ రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్‌లో కావలి ఐఎంఏ ప్రెశిడెంట్ కే. సుబ్బారావు, సెక్రటరీ వీ. గోపి, కోశాధికారి పీ. శివప్రసాద్‌లు రాష్ట్ర ఐఎంఏ నేతలనుంచి ఈ అవార్డులు అందుకున్నారు. కావలి ఐఎంఏ ఆధ్వర్యంలో సర్వయికల్ క్యాన్సర్ పోగ్రాంతో పాటు పలు ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కే. సుబ్బారావు, వీ. గోపీ మాట్లాడుతూ కావలి ఐఎంఏ సభ్యులందరి కృషి ఫలితంగా ఈ అవార్డులు లభించాయని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామన్నారు.

మాక్ అసెంబ్లీలో ప్రతిభ చూపాలి

● డీఈవో బాలాజీరావు



అమరావతి వెళ్తున్న విద్యార్థులతో రైల్వే స్టేషన్‌లో డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపాలని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు అన్నారు. అమరావతికి వెళుతున్న విద్యార్థులకు ఆదివారం ఆయన రైల్వేస్టేషన్‌లో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఒకరి చొప్పున మొత్తం 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇప్పటికే దీనిపై జిల్లాలో శిక్షణ పొందిన విద్యార్థులకు మరో రెండు రోజుల పాటు అమరావతిలో అసెంబ్లీ నిర్వహణ, రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యతను తెలియచేస్తారన్నారు. ఈనెల 26వ తేదీన అసెంబ్లీ ప్రాంగణం వద్ద రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి హాజరైన విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు, ఎస్కార్ట్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

26న పారా క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పారా క్రీడాకారుల ఎంపిక ఈనెల 26వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో చేపడతామని డీఎస్‌డీవో పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళల కు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో అండర్-17 విభాగంలో సబ్‌జూనియర్స్, అండర్-20 విభాగంలో జూనియర్స్, ఓపెన్ కేటగిరిలో సీనియర్స్ క్రీడాకారుల ఎంపికలుంటాయని పేర్కొన్నారు. అలాగే 100, 200 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, 500 మీటర్ల స్విమ్మిం గ్, టేబుల్‌టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పారా క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో పాటు ప్రభుత్వం జారీ చేసిన వైకల్యం నిర్ధారణ సర్టిఫికెట్‌తో సంబంధిత తేదీలో ఉదయం 9 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై రౌడీ షీటర్ల దాడి

● ఎస్పీ అజిత ఆదేశాలతో కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాల జాతీయ రహదారిపై ఆర్టీసీ డ్రైవర్‌పైన దాడిచేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఆదివారం బుచ్చి పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి రేబాల వద్ద హైవేపై ఓ కారు డోర్ తెరచి రోడ్డుపై ఆపి ఉంచడంతో, నెల్లూరు నుంచి ఆత్మకూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ హారన్ మోగించాడు. వెంటనే కారులోనుంచి నలుగురు వ్యక్తులు దిగి ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ బుచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కానీ కేసు నమోదు కాలేదు. ఆదివారం ఉదయం ఎస్పీకి ఫిర్యాదు అందడంతో సంఘటనపై ఆరా తీశారు. దాడికి పాల్పడ్డ నెల్లూరుకు చెందిన ముగ్గురు రౌడీషీటర్లపై కేసు నమోదు చేయాలని బుచ్చి పోలీసులను ఎస్పీ ఆదేశించారు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో ఆలయాలకు మహర్దశ

● రూ. 6.5 కోట్లతో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం

● శంకుస్థాపన చేసిన దేవదాయశాఖ మంత్రి ఆనం



అమ్మవారి ఆలయ నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. ఆదివారం మండలంలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి పట్టమహిషి ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 6.5 కోట్ల అంచనాతో ఆదిలక్ష్మి అమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనలతో ఆలయాలకు మహర్ద శ కల్పించేందుకు కృషి చేస్తు న్నామన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 141 దేవాలయాలకు, ప్రతి నెలా పది వేల రూపాయలు ధూప దీప నైవేద్యాలకు అందిస్తున్నామన్నారు. జిల్లాలో సీజీఎఫ్‌ఎస్ ద్వారా 58 ఆలయాల అభివృద్ధి పనులకు రూ. 118.45 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో గ్రామ దేవత పోలేరమ్మ జాతరలో ధ్యాన మందిర నిర్మాణం, బాలాయపల్లి మండలంలో యాచవరం ఆల యానికి కూడా నిధులు మంజూరు చేశామన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పెంచలకోన క్షేత్రంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించి, అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆలయానికి ముందు డబుల్ రోడ్డు వేసేందుకు అటవీ శాఖ నుండి అనుమ తులు ఇప్పించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మండలాధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, పెంచలకోన ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పీర్ల సోమయ్య యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ల పంపిణీకి ముహూర్తమెప్పుడు..?

● శిక్షణ సరే.. కుట్టుమిషన్లు ఎప్పుడిస్తారు..?

● జిల్లాలో 3500 మందికి పైగా మహిళలకు తర్ఫీదు

● ఐదునెలలు గడిచినా పట్టించుకోని అధికారులు

● నిరీక్షిస్తున్న శిక్షణార్థులు



సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా సుమారు 3,500 మందికిపైగా మహిళలకు ప్రభుత్వం కుట్టుశిక్షణ ఇప్పించింది. అయితే శిక్షన పూర్తై ఐదు నెలలు గడిచినా, వారికి ఉచితంగా ఇస్తామన్న కుట్టుమిషన్లు ఇంతవరకు పంపిణీ చేయలేదు. దీంతో శిక్షణార్థులు మిషన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

● ఆర్థిక స్వావలంబన కోసం..

జిల్లాలోని బీసీ, ఈబీసీ మహిళలు స్వయంఉపాధితో వారి కాళ్లమీద వారే నిలబడి ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో పది నెలల కిందట ప్రభుత్వం కుట్టుమిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో కుట్టుమిషన్ నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకుంటే శిక్షణతోపాటు ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో అనేకమంది మహిళలు కుట్టుశిక్షణకు ఆసక్తి చూపించారు. దీంతో మహిళలకు ఉచితం శిక్షణతోపాటు శిక్షణానంతరం కుట్టుమిషన్ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం ఓ కాంట్రాక్టరు అప్పగించింది.

● మూడు నెలలపాటు శిక్షణ

కాంట్రాక్ట్ దక్కించుకున్న వారు జిల్లాలో ప్రతీ మండల కేంద్రంలో ఓ కుట్టు శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేసి వసతులు కల్పించారు. ప్రతి మండలంలో సుమారు వందమంది చొప్పున జిల్లా వ్యాప్తంగా సుమారు 3,500 మందికి గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు శిక్షణ ఇప్పించారు. ఇందులో భాగంగా సంగం మండలంలో మూడు బ్యాచ్‌ల్లో సుమారు 150 మంది శిక్షణ పొందారు.

● ఐదు నెలలు పూర్తయినా...

కుట్టుమిషన్ శిక్షణ పూర్తై ఐదు నెలలు పూర్తయినా, ఇంత వరకు వారికి ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్లు ఇవ్వలేదు. స్థానిక అధికారులనడిగితే వారి వద్ద సమాధానం లేదు. దీంతో శిక్షణ పొందిన మహిళలు తాము నేర్చుకున్న శిక్షణ ను కూడా మరిచిపోయేటట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉచిత కుట్టుమిషన్లను వెంటనే పంపిణీ చేయాలని శిక్షణ పొందిన మహిళలు కోరుతున్నారు.

బధిర ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎంపిక



బధిరుల సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గం

నెల్లూరు(హరనాథపు రం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బధిరుల ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ నూతన కార్యవర్గా న్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని ఎన్జీవో హోంలో ఎన్నికల అధికారి పీ.కిరణ్‌కుమార్, అసోసియేట్ ఎన్నికల అధికారి కే.సురేష్‌ల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. సంఘం అధ్యక్షుడుగా వీ.కుమార్, అసోసియేట్ అధ్యక్షుడుగా వీ.మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడుగా పీ.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టీ.గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.కిషోర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వై.వినయ్‌కుమార్, ట్రెజరర్‌గా ఎన్. తిరుమల రావు, మహిళా కార్యదర్శిగా ఏ.వైష్ణవి, ఈసీ మెంబర్లుగా జీ.నర్మద, ఎం.శివకుమార్, కే.సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ఏవీ కృష్ణకుమార్, ఆంధ్ర ప్రదేశ్ హియరింగ్ హాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏ.వెం కటరెడ్డి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షులకు ప్రశిక్షణ తరగతులు

● రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వాకాటి నారాయణరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేసేందుకు ఈనెల 25వ తేదీన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ మండల అధ్యక్షులకు ప్రశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి తెలిపారు. అందులో భాగంగా తోటపల్లి గూడూరు టీఎంఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ప్రశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడులు రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఒక పక్క రాష్ట్రాభివృద్ధి, మరో పక్క సంక్షేమాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. రాబోయే మూడేళ్లలో పేదలకు 17 లక్షల ఇళ్లు రాష్ట్రంలో కట్టాలనే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, గడ్డం విజయ కుమార్, మొగరల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గోతాము వల్లనే బస్సులో పొగలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఇంజన్ బొనెట్‌కు కుడివైపు అల్యూమినియం షీట్ లేనందున డ్రైవరు గోతాముతో కప్పి ఉం చడం వలన బస్సులో పొగలు వచ్చాయ ని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి ఎస్‌కే షమీమ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. నెల్లూరు-2వ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ఈనెల 22వ తేది రాత్రి ఊటుకూరుకు వేళ్లే సమయంలో రాజుపాలెం వద్ద కు వచ్చే సరికి ఇంజన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై నీళ్లతో పొగలను ఆర్పారు. బస్సుల్లోని 30 మంది ప్రయాణికులు ఎలాంటి ప్రమాదం లేకుం డా బయటపడ్డారు. బస్సును చెక్ చేయ గా ఇంజన్ బొనెట్‌కు కుడి వైపు అల్యూమినియం షీట్ లేనందున డ్రైవర్ గోతాముతో కప్పడంతో సైలెన్సర్‌కు తగిలి పొగ లు వచ్చాయని ఆర్ఎం తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

నెల్లూరురూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని గొలగముడి రోడ్డు మార్గంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీలో నివసించే వంకదారి వరలక్ష్మి(35) ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తుంది. ఈ క్రమంలో శనివారం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన ఆమె యధావిధిగా భోజనం చేసి పడుకుంది. కొంత సేపటికి ఆమె అపస్మారక స్థితిలో ఉందని భర్త వంగమలై మనోహర్ పక్కనే ఉంటున్న ఆమె సోదరుడు వంకదారి శ్రీనివాసులకు చెప్పాడు. ఇరువురు ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించ గా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా మృతురాలి భర్త మనోహర్ వ్యాపార రీత్యా నష్టాలు రావడంతో మద్యానికి బానిసై తరుచూ భార్యాభర్తలు గొడవలు పడుతుండేవారని, ఈ నేపథ్యంలో ఆమె మృతి అనుమానా స్పదంగా ఉందని తమకు ఫిర్యాదు అందిందని ఆయన తెలిపారు.

మద్యం పట్టివేత

వింజమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమిదపాడు గ్రామంలో ఆదివారం అక్రమ మద్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ మొహమ్మద్ అబ్దుల్‌జలీల్ తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడులలో కలిగిరి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెజ్లింగ్ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య) : జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సీనియర్ పురుషులు, మహిళల రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎం.శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2005 సంవత్సరానికి ముందు జ న్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. 2006, 2007లో జన్మించిన వారు మెడికల్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల అనుమతి పత్రంతో ఎంపికలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులందరూ ఆధార్, బర్త్ సర్టిఫికెట్లతో సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ఆటోల దొంగ అరెస్ట్

● ఆరు వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వరుసగా ఆటోల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లు గప్పి తిరుతున్న దొంగను చిన్న బజారు పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితుడు వివరాలను చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆదివారం విలేకర్ల సమావేశంలో వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరు 29వ తేదీన దగదర్తి మండలం దామవరంకు చెందిన జలదంకి మల్లికార్జున తన తాతకు ఆరోగ్యం సరిగా లేనందున నగరంలోని రెయిన్‌బో వైద్యశాలకు తన ఆటోలో తీసుకువచ్చి ఆటోను వైద్యశాల బయట పార్క్ చేశారు. వైద్యశాల వైద్యం చేయించుకున్న తరువాత బయటకు వచ్చి చూడగా ఆటో కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికి చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ రజాక్ కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో ఆటో చోరీకి పాల్పడింది కొడవలూరు మండలం ఎల్లాయపాలెంకు చెందిన కదివేటి శ్రీకుమార్‌గా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో నగరంలో చేసిన ఆటో చోరీతో పాటు మరో ఆరు ఆటోలు అపహరించినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో సుమారు రూ.4.61 లక్షల విలువ చేసే ఆరు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్‌రజాక్, క్రైమ్‌పార్టీ ఏఎస్ఐ బీవీ రవిప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ జే.సురేష్ బాబు, ప్రసాద్, కానిస్టేబుల్ ఎస్‌వీ శ్యామ్‌ప్రసాద్, ఎం.సుబ్బారావు, తదితరులను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మర్రిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలి యని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... 565వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి బూదవాడ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొం ది. తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు అతడిని 108 సహాయంతో ఉదయగిరి వైద్యశా లకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు కార్డులు లేనందున పేరు, ఊరిపేరు అడ్రస్ తెలియలేదని, మృతు డు బ్లూ రంగు చొక్కా, కుడి చేతిపై టాటూ వేయుంచుకొని ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి వైద్యశా లలో ఉంచారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజానాట్యమండలి నూతన కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షుడు రమణయ్య

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షుడు నందిపోగు రమణయ్య మాట్లాడారు ప్రజానాట్యండలి మహాసభలో భాగంగా 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. గౌరవ అధ్యక్షుడుగా తనతో పాటు జిల్లా అధ్యక్షుడుగా విజయకుమార్, కార్యదర్శిగా తళ్ల శీనయ్య, కోశాధికారిగా ఎస్‌కే షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షులుగా కొలగాని రమేష్, చలపతి, సహాయ కార్యదర్శులుగా మంద శీనయ్య, సంజన, పందిటి శీనయ్యలతో పాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని తెలిపారు. కాగా జిల్లాలోని 8 నియోజకవర్గాలలో 38 మండల శాఖలను ఏర్పాటు చేసి కళాకారులను కళారంగంలో తీర్చిదిద్దేందుకు మూడు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు విహార యాత్ర

● ఒక్కొక్కరికి రూ.500 కేటాయింపు ● జిల్లాలో 1612 మందికి అవకాశం

నెల్లూరు(విద్య), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాల కంటే, క్షేత్రస్థాయిలో విద్యార్థులే గమనించే అంశాలే వారిపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. అందుకే ప్రభుత్వం వారిని అప్పుడప్పుడూ విహారయాత్రకు పంపుతూ ఉంటుంది. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత రెండోవిడత విద్యార్థులకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా జిల్లాలో 1,612 మంది విద్యార్థులతోపాటు వీరికి సహాయకులుగా ఉపాధ్యాయులు కూడా విహారయాత్ర చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకుగాను జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.



● పీఎంశ్రీ పథకం కింద 39 పాఠశాలల విద్యార్థులు

జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులతోపాటు పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 39 పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం విహారయాత్రకు కల్పించింది. వీరంతా విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లేందుకు నిధులు విడుదల చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.500ల చొప్పున కేటాయిస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ఖాతాలకు ఎస్ఎస్ఏ నుంచి నిధులు జమ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి 131 మంది విద్యార్థులతో పాటు పీఎంశ్రీ పాఠశాలల నుంచి 1481 మంది కలిపి మొత్తం 1612 మంది ఎక్స్‌పోజర్ విజిట్ కింద విహారయాత్ర చేసేందుకు అనుమతించారు. వీరితోపాటు చురుకైన 50 ఏళ్ల లోపు వయసు కలిగిన ఎస్కార్ట్ ఉపాధ్యాయులను కూడా ఎంపిక చేశారు. ప్రతి పదిమంది బాలురకు ఒక పురుష ఉపాధ్యాయుడు, పది మంది బాలికలకు ఒక మహిళా ఉపాధ్యాయురాలు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తారు. దీనికి సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారులే చొరవ తీసుకుని విజ్ఞానంపై ఆసక్తి కలిగి సైన్స్ ప్రదర్శనల్లో ప్రతిభ చూపే విద్యార్థులతో పాటు, ఆసక్తి చూపించే వారికి గుర్తించి వారి ఎంపిక, పర్యటించే ప్రాంతాలను కూడా ఖరారు చేశారని ఎస్ఎస్ఏ అధికారులు తెలిపారు. త్వరలోనే వీరు సందర్శించే ప్రాంతాన్ని ఖరారు చేసి, తేదీలను కూడా ప్రకటిస్తామన్నారు. విహార యాత్రకు వెళ్లే విద్యార్థులకు ఎస్ఎస్ఏ రూ.10.33 లక్షల నిధులు విడుదల చేసింది. నాన్ పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు రూ.2,92,000లు, పీఎంశ్రీ విద్యార్థులకు రూ.7,40,500లను విడుదల చేశారు. ఈ నిధులను యాత్రకు కేటాయించి త్వరలోనే కార్యక్రమాన్ని విజయవంతంగా చేస్తామని అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100) : 660

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,881

వెండి కిలో ధర రూ. 1,58,400

వెండి ఒక గ్రాము రూ.163.40

జేబీ విద్యార్థుల సామాజిక సర్వే

కావలి (టౌన్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో ఆదివారం జేబీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే సామాజిక, ఆర్థికపరమైన సర్వే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా నిర్వహించి సర్వేలో విద్యార్థులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సర్వే వల్ల ఆయా ప్రాంతాల్లోని ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు అయూబ్ అహ్మద్, నాగేశ్వరరావు, పీడీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను అమలుచేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బద్దిపూడి గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ కూనం అనీల్‌రెడ్డి, కూనం వెంకట సుబ్బారెడ్డిల వర్ధంతి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎంపీ వేమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కూనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. తొలుత కూనం అనీల్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డిల సమాధుల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆసుపత్రులను ప్రయివేటు పరం చేస్తోందంటూ గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టడం వైసీపీకి తగదన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన ఆసుపత్రులను అభివృద్ధి చేసి తిరిగి ప్రభుత్వపరం చేయడమే పీపీపీ ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

రోడ్డు, వంతెనకు నిధులివ్వండి

బద్దిపూడి చెరువు మీదగా కొత్తపేట చెరువుల వరకు తారురోడ్డు నిర్మాణం, బద్దిపూడి గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న ఉప్పుటేరుపై తూములతో వంతెన ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ఎంపీ నిధులు మంజూరు చేయవలసిందిగా ఎంపీని కోరగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. కాగా, వైద్యశిబిరంలో సుమారు 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూనం ఈశ్వరమ్మ, కూనం బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు వెంటకటరమణ ప్రయివేటు ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

అల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించాలని సామాజికవేత్త ఎం. మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో దాదాపు 1000 కి.మీ సముద్ర తీరం ఉందని, ఈ తీరం వెంబడి 55 లక్షల మంది మత్స్యకారులు జీవిస్తున్నారన్నారు. మత్స్య సంపదను సేకరించి విదేశీ మారకద్రవ్యాన్ని రాష్ట్రానికి తెచ్చేందుకు ప్రధాన భూమికను పోషిస్తున్న మత్స్యకారులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి దివి పరామర్శ

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన పట్టణంలోని సింహాద్రినగర్‌కు చెందిన టీడీపీ క్రియాశీల కార్యకర్త పరిటాల మాదవరావు కుటుంబసభ్యులను టీడీపీ నేత దివి రవీంద్రనాథ్ ఆదివారం పరామర్శించారు. మాదవరావు బావమరిది, కాంట్రాక్టరు చిడిపోతు వెంకట సురేష్‌బాబు, ఇతర కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

సర్కస్ ఫీట్లు కాదు.. వాహనదారుల పాట్లు!



కలిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలిగిరి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కలిగిరి పట్టణంలో నిర్మించిన జాతీయ రహదారి పనులు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక హెచ్‌పీ పెట్రోల్‌బంకు సమీపంలో రోడ్డు సరిగా లేకపోవడంతో కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టరు ప్రమాదవశాత్తు ఇంజన్ భాగం పైకి లేచింది. స్థానికులు అప్రమత్తమవడంతో ప్రమాదం తప్పింది. రహదారి పనులు సరిగా చేయకపోవడంతో ఈ మలుపు వద్ద సర్కస్ ఫీట్లు చేయాల్సివస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గుంతలమయమైన రహదారి నిర్మాణాలను సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కంధపురి జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మాలధారులు ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఆయన జనార్ధనస్వామిని, వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి దుడ్డు ప్రసాద్, మాలధారులు హనుమంతరావు, మురారిశెట్టి సుధీర్, చక్కా కేశవ తదితరులు పాల్గొన్నారు.

మేధోశక్తిని పెంపొందించుకుంటేనే లక్ష్య సాధన : డీఎస్పీ శ్రీధర్

కావలి (టౌన్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకుంటేనే లక్ష్యసాధన సాధ్యమవుతుందని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎమ్ఎమ్ఎస్) నమూనా పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఫౌండేషన్ చైర్మన్, విశ్రాంత అధ్యాపకులు ప్రసాదరావు అధ్యతన జనతాపేటలోని విశ్వశాంతి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై బహుమతులు అందజేసి, విద్యార్థులను అభినందించారు. కేంద్రప్రభుత్వం డిసెంబరు 7న నిర్వహించనున్న ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్షలకు సమాయాత్తం అయ్యేందుకు ఇటువంటి నమూనా పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. మొదటి బహుమతి జ్యోత్స్న, రెండవ బహుమతి నాగచైతన్య, మూడవ బహుమతి ఆదిత్యశేఖర్, నాల్గవ బహుమతి సమీర్, మరో ఆరుగురు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీ రమణయ్య, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఖాదర్‌బాష, ఆర్ దిలీప్‌కుమార్, సయ్యద్ ఘనీ బాష, మాలకొండారెడ్డి, అజిత్ బాబు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలిని కనక పట్టణంగా మారుస్తా!

● వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణాన్ని కనక పట్టణంగా మార్చి చూపిస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లతా థియేటర్ ఎదురుగా వడ్డిపాలెం వద్ద బ్రహ్మంగారి ఆలయ పునరుద్ధరణలో భాగంగా ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మం గారి ఆశీస్సులు కావలి నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాం క్షించారు. కావలి పట్టణం కనక పట్టణం అవుతుందని ముందుగానే మహిమాన్వితంగా ప్రకటించిన ఏకైక తాత్వికుడు బ్రహ్మంగారేనని, ఆ దేవదేవుని ఆశీస్సులతో కావలిని నిజమైన కనక పట్టణం చేసి చూపిస్తానని ఆయన అన్నారు. పవిత్రతకు మారుపేరైన ఈ ప్రాంతం బ్రహ్మంగారు, గంగమ్మ, అంకమ్మ, కలుగోళ్లశాంభవి ఆలయాలతో సాంస్కృతి, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి రూ. 50 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపవని రోడ్డు నుంచి కలుగోళ్ల శాంభవి ఆలయం వరకు ఈ ప్రాంతంలో విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు.

● అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

స్థానిక ముసునూరులోని ఆలయంలో అయ్యప్పస్వామిని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాకిచర్ల విద్యార్థి ఎంపిక



ఉలవపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి సూరగాని గోకుల్‌చందు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ రావు తెలిపారు. ఇటీవల తెనాలిలో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని తుమ్మూరులో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, తోటి విద్యార్థులు గోకుల్‌చందును అభినందించారు.

పులి శీనయ్యకు పితృవియోగం

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చవటపుత్తేడు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, తలమంచి మేజర్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పులి శీనయ్య తండ్రి పులి యర్రయ్య (70) శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదివారం యర్రయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు జలదంకి శ్రీహరినాయుడు, అల్లం హనుమంతరావు, పావన బోయిన మల్లికార్జునరెడ్డి, తాఖ్యారు సుధాకర్ నాయుడు, వడ్డే వినయ్‌కుమార్ స్థానిక టీడీపీ నేతలు కార్యకర్తలు ఉన్నారు.

శివయ్య, గంగమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలోని గంగతిప్పపై వెలసిన శివయ్యగంగమ్మలకు బోగోలు షిర్డీసాయి సేవకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి పురాతన శివలింగానికి సాయిసేవక బృందం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సాయిసేవకులు లింగంశెట్టి విజయ, మానికల ఐశ్వర్య, తుమ్మలపల్లి గీత, బచ్చుపద్మ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కావలి (టౌన్) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ నెల 25న కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డీ. కృష్ణారెడ్డి కోరారు. 14 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే ఈ జాబ్‌మేళాలో 830మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీ ఫార్మసీ, పీజీ అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులన్నారు. రూ. 12,000 నుంచి రూ. 25,000 వరకు వేతనా లు ఉంటాయన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాహసీల్దారు కార్యాలయంలో ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, కార్యాలయ సిబ్బంది సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కొండయ్య, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు ప్రతాప్, పి రవిబాబు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి: సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

●**సంగం:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు హజరత్‌మస్తాన్, శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్ నరసింహారావు, వీఆర్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయం 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు సన్మానించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి

అంకాళమ్మకు పొంగళ్లు

సీతారామపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెస్తకాలనీ సమీపంలో కొలువైన గ్రామదేవత అంకాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అంకాలమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి అభిషేకాలు

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగం, పెన్నానది ఒడ్డున సంగమేశ్వరాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ భక్తులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అయ్యప్పకు అభిషేకాలు చేస్తున్న అర్చకులు

ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ ధ్యేయం : మంత్రి ఆనం

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా ఆలయాలను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ ట్రస్టీగా నియమితులైన కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆలయాల పరిరక్షణ తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆత్మకూరులోని అభయాంజ నేయస్వామి ఆలయ వంశ పారంపర్య అధ్య క్షుడు కాటంరెడ్డి రవీంద్రరెడ్డికి ఆలయ అభివృద్ధి బాధ్యతలను అప్పగిస్తున్నామన్నారు. త్వరలోనే ఆలయ పాలకమండలి సభ్యులను నియమిం చాలని జిల్లా దేవ దాయ శాఖ అధికారిని ఆదేశించామన్నారు. ప్రతి గుడిలో దూపదీప నైవేద్యం కోసం రూ. 10వేలు మంజూరు చేస్తున్నామన్నారు. అభయాంజనేయస్వా మి ఆలయం వద్ద నుంచి మినీ బైపాస్ రోడ్డును 100 అడుగులతో నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసేలా పనులు చేపట్టామన్నారు. ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. ముందుగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వేదపండితులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జి వెంకటరమణమ్మ, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి, రాజవోలు సొసైటీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి, పలువురు కూటమి నేతలు, పురప్రముఖులు పాల్గొన్నారు.



కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఆనం

ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించాలి

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజనసంఘం వద్ద ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆదివారం సిద్దీపురం గ్రామానికి చెందిన మహిళలు ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. దీంతో ఆయన అక్కడే ఉన్న తహీసీల్దారు సోమ్లానాయక్‌ను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంకు అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్నా.. మీకోసం'

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుసేవా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు కుటుంబాన్ని కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సందేశం వినిపించడం, నీటి లభ్యత, డిమాండ్ ఆధారిత పంటలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగంపై ఇంటింటా ప్రచారం

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులను వినియోగిస్తే గ్రామాలు ఆర్థికాభివృద్ధి చెందుతాయని మండల బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆత్మనిర్భర భారత్ కార్యశాల కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మండలంలోని కుర్రపల్లి, శకునాలపల్లి, బోడబండ, పుల్లాయపల్లి, లింగంనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో స్వదేశీ వస్తువులు వినియో గించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నాయకులు గడ్డం ప్రసాద్, మాధవరెడ్డి, మన్నేటి శ్రీనివాసులరెడ్డి, నారా యణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యం

ఉదయగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు పెంపొందించడమే లక్ష్యంగా జమాతే ఇస్లామీ హింద్ పనిచేస్తోందని ఆశాఖ జిల్లా అధ్యక్షురాలు ఫాతిమా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దిలార్‌భాయ్ వీధి మదరసాలో ఉదయగిరి జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు అసియా ఆధ్వర్యంలో పొరుగువారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈఉద్యమ నిర్వహణకు మహిళా కన్వీనర్‌గా ఫర్వీన్, కోకన్వీనర్‌గా అల్సానియాలు వ్యవహరించి వివిధ ప్రాంతాలు, కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జమాతేఇస్లామీ హింద్ సభ్యులు

గిరిజన కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు

ఆత్మకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని 21వ వార్డు మోడల్ ఎస్టీ కాలనీలో నిత్యాన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సొంత నిధులతో తాగునీటి బోరును ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన అనంతసాగరం మండలం చిలకలమర్రి గ్రామానికి వెళ్లి ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన గంటపోయిన పెంచలయ్యయాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. దగ్ధమైన ఇంటిని పునర్నిర్మించుకునేందుకు రూ. 20వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అనంతసాగరం మండల టీడీపీ మాజీ అధ్యక్షురాలు మునగపాటి సునీతమ్మ, ఆత్మకూరు పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు కట్టా మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



అభిషేకాలకు పెన్నానది జలాలను తీసుకు వస్తున్న భక్తులు

సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయనగర్‌లో సీతలాంబ, బొడ్డురాయి, గెవిటి రాళ్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బిందెలతో పెన్నానది జలాలు తెచ్చి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'అన్నదాత సుఖీభవ'తో రైతులకు వెసులుబాటు




మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతసాగరం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడంతో మొదటి పంట సాగుచేస్తున్న రైతులకు వెసులుబాటు కలిగిందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు తెలిపారు. ఆదివారం టీడీపీ నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి ఖర్చులకు నిధులు వేయడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ యువత అధ్యక్షుడు కమ్మ ప్రభాకర్‌నాయుడు, ఇస్కపల్లి మాజీ సర్పంచు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలి

వింజమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లు లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సారథ్యంలో నూతన ఇళ్ల మంజూరుకు దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని టీడీపీ నాయకులు కోడూరు నాగిరెడ్డి తెలిపారు. స్థానికంగా సచివాలయంలో 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాబిలిపై చల్లని తల్లి



● చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించిన పద్మావతీ దేవి ● ఉదయం సూర్యప్రభపై కాంతులీనిన అమ్మవారు

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతీ దేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారు చంద్రప్రభ వాహనంపై వెన్నముద్దకృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి ఆభరణాలు, పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలలతో అలంకరించి, అధిష్ఠింపజేశారు. గజ, తురగ, అశ్వాలు ముందుకు సాగుతుండగా జియ్యర్ స్వాములు దివ్యవ ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యం, చిన్నారుల కోలాటం, భజన బృందం కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు సాగింది. ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చారు. యోగనారాయణుడి సూర్యప్రభ వాహనంపై పద్మావతీ అమ్మవారు భక్తులను కటాక్షించారు. తిరుమాడవీధుల్లో సూర్యప్రభ వాహనసేవ అత్యంత వేడుకగా సాగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి కేటీ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. జియ్యర్ స్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

● నేటితో ముగియనున్న వాహన సేవలు

పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న చిన్నశేష వాహనంతో ప్రారంభమైన వాహన సేవలు సోమవారం రాత్రి అశ్వ వాహనంతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.

రేపటితో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

మంగళవారం జరిగే పంచమి తీర్థంతో అమ్మవారి కార్తీక వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అదే రోజు తిరుమల నుంచి అమ్మవారికి శ్రీవారి సారె రానుంది.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9.15 గంటలకు రథోత్సవం
సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ
రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం

రథోత్సవానికి సర్వం సిద్ధం



తిరుచానూరు : అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం 9.15 గంటలకు ధనుర్‌లగ్నంలో రథోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా రథాన్ని వివిధ కళాఖండాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సులువుగా తిరిగేందుకు వీలుగా తిరుమాడవీధుల్లో ఇసుక పరిచారు. అపశ్రుతులు దొర్లకుండా టీటీడీ, ఇంజనీరింగ్, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో ముందస్తుగా భద్రత చర్యలు తీసుకున్నారు. మాడవీధుల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు.

సత్యసాయి స్ఫూర్తితో సమాజ సేవ



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పద్మావతి నగర్‌లో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొని సత్యసాయి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి ట్రస్టు చేపట్టిన సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా కరువ పరిస్థితులో ఉన్న సమయంలో బాగా ఆదుకున్నాయని తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులు ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు.



సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోయినా, అర్జీల ప్రస్తుత పరిస్థితి తెలుసుకోవాలన్నా 1100కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పంచమి తీర్థం ముందస్తు భద్రతా చర్యలు ఉన్నందున సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఎవరూ జిల్లా కేంద్రానికి రావద్దని, సమీప పోలీసుస్టేషన్లకు వెళ్లాలని సూచించారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల వినియోగదారులు 8977716661కు ఫోన్‌చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీనంబర్లు 1912 లేదా 18004251555333లకు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

టైమ్స్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీయూకు చోటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీ యూనివర్సిటీకి చోటు దక్కింది. ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ ర్యాంకింగ్స్‌లో 601-800 మధ్య ర్యాంకు సాధించింది. తద్వారా యూనివర్సిటీ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల్లో ప్రపంచ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంది. మన దేశం నుంచి 88విద్యా, పరిశోధన సంస్థలు ఈ పోటీలో పాల్గొనగా పరిశోధనల్లో నాణ్యత, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలు, పర్యావరణ సంబంధ కృషిలో ఎస్వీయూ ప్రత్యేకతను నిరూపించుకుంది. ఎస్వీయూకు ర్యాంకు దక్కడం పట్ల వీసీ నరసింగరావు,రెక్టార్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

పద్మావతి ఆస్పత్రి మెడికల్ షాపు మూత

● స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి బ్రేక్ ● టీటీడీనే సొంతంగా నిర్వహించేందుకు కసరత్తు



పద్మావతి ఆస్పత్రిలో మూతపడిన మెడికల్ షాపు

శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద నామమాత్రపు అద్దెతో గడువు తీరిపోయినప్పటికీ పొడిగింపుతో కొనసాగుతున్న వైసీపీ వర్గీయుల మెడికల్ షాపును టీటీడీ రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం మూసివేశారు. లాభాపేక్ష లేకుండా మెడికల్ షాపు నిర్వహించేలా టీటీడీ పాలకమండలి సమావేశంలో ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. దీంతో వైసీపీ హయాంలో స్విమ్స్ ఆస్పత్రిలో మొదలైన పులివెందుల పెత్తనానికి బ్రేక్ పడినట్లయింది.

● మాఫియాకు షాక్

స్విమ్స్‌లో పద్మావతి జనరిక్ మెడికల్ షాపుతో పాటు గడువు తీరిన డాక్టర్ క్యాంటీన్‌ను కూడా మూసివేయించారు. టీటీడీ తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్ సువర్ణ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, స్థానిక పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది స్విమ్స్‌కు చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలకు ఉపక్రమించారు. తొలుత స్విమ్స్ ఓపీ విభాగం వద్ద ఉండే షాపును రద్దు చేయగలిగారు గాని పులివెందుల చేతిలో ఉన్న పద్మావతి ఆస్పత్రి వద్ద ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోయారు. తొలుత కేవలం రూ17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించి, ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు. దాదాపు రూ.20లక్షలు అద్దె అవకాశం ఉన్నప్పటికీ మాఫియా ఒత్తిళ్లతో కొనసాగిస్తూ వచ్చారు. దీనిపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో టీటీడీ నాలుగు సార్లు టెండర్లు పిలిచింది. మెడికల్ మాఫియా రింగుగా మారి షాపులు పంచుకున్నారన్న ఆరోపణలున్నాయి. వీరు ఇంతకాలం కొనసాగడానికి రెవెన్యూ విభాగంలోని వైసీపీ వాసనలుపోని కొందరి సిబ్బంది ప్రమేయం ఉందన్న విమర్శలు ఉన్నాయి. ఈనేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ నిర్ణయంతో మెడికల్ మాఫియా షాక్‌కు గురైంది.

● టీటీడీ షాపునకు కసరత్తు

స్విమ్స్ యాజమాన్యమే మెడికల్ షాపును గతంలో నిర్వహించింది. 20 ఏళ్ల క్రితం పాత క్యాజువాల్టీ సమీపంలో మెడికల్ షాపును స్విమ్స్ ఆధీనంలోని సిబ్బందే నిర్వహించారు. ఆ తర్వాత రాజకీయ జోక్యం పెరగడంతో ప్రైవేట్ వ్యక్తులు పాగా వేశారు. తాజాగా ఛైర్మన్ నిర్ణయంతో మళ్లీ స్విమ్స్ చేతికి ఫార్మసీ పగ్గాలు వెళ్లనున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

అన్నదాత సుఖీభవ డబ్బందలేదా!

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నిధులు జమకాని రైతులు అన్నదాత సుఖీభవ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేదంటే సమీప గ్రామ సచివాలయాల్లో అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

శ్రీసిటీలో స్మైలీ ఏకో ఇండస్ట్రీస్ ఉత్పత్తుల ప్రారంభం



ఉత్పత్తులను ప్రారంభిస్తున్న భువనేశ్వరి

సత్యవేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నాప్కిన్ తయారీ పరిశ్రమ స్మైలి ఏకో ఇండస్ట్రీస్ తమ ఉత్పత్తులను లాంఛనంగా ప్రారంభించింది. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేతుల మీదుగా శనివారం సంస్థ ఎండీ పరుచూరి మల్లికార్జున్ ప్రారంభించారు. మహిళలకు నెలసరిలో అవసరమయ్యే 10 వేల నాప్కిన్స్‌ను ఎన్టీఆర్ ట్రస్టుకు ఈ సందర్భంగా వితరణ చేసినట్లు ఆయన తెలిపారు.



ఎంవోయూ చేసుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ఐఐటీ, సీఈఎంఎస్ ఎంవోయూ

ఏర్పేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ, విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ మధ్య ఎంవోయూ కుదిరింది. సీఈఎంఎస్ సీఈవో గోపీకృష్ణ శివం, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఐఐటీ డైరెక్టర్ కే.ఎన్.సత్యనారాయణ, సీడీవో డీన్ అరుణ్ టంగిరాల మాట్లాడుతూ టెక్నాలజీ రంగాల్లో విద్యా-పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక అడుగుగా ఈ ఎంవోయూ నిలిచిందన్నారు. భవిష్యత్తు టెక్నాలజీకి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను, సంస్థలను శక్తివంతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ సాయికృష్ణ, సీఈఎంఎస్ జీఎం సబ్యసాచి మజుందార్, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతికి చేరుకున్న సిట్ బృందం

● నేటి నుంచి పరకామణి కేసు పునర్ విచారణ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : తిరుమల పరకామణి కేసు వారం రోజుల విరామం అనంతరం సోమవారం నుంచి పునర్ విచారణ ప్రారంభం కానుంది. సీఐడీ సిట్ బృందం ఆదివారం తిరుపతికి చేరుకుంది. పద్మావతి అతిథిగృహంలో పరకామణి చోరీ కేసులో తదనంతర పరిణామాలపై విచారణ మొదలుకానుంది. నిందితుడు రవికుమార్‌తో పనిచేసిన సిబ్బందితోపాటు కొంతమంది టీటీడీ పెద్దలను విచారించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రూ.14 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి ఇవ్వాలని ఎందుకు అనుకున్నారు? ఎవరు ఆదేశించారు? అనే విచారణ కీలకంగా మారనుంది.

28 నుంచి షోడశదిన సుందరకాండ పారాయణం

తిరుమల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం ఈ నెల 28 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు తిరుమలలోని వసంతమండపంలో షోడశదిన సుందరకాండ పారాయణం నిర్వహించనున్నారు. 27వ తేదీ సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో అంకురార్పణ చేయనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంత మండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్ఠానం నిర్వహించనున్నారు. డిసెంబరు 13వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య వేదవిజ్ఞానపీఠంలో పూర్ణాహుతితో ఈ కార్యక్రమం పరిసమాప్తి అవుతుంది.

తిరుమలేశుడి సేవలో నటి నిక్కీ

సినీ నటి నిక్కీ గల్రానీ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన నిక్కీని చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఫొటోలు తీసుకున్నారు. నిక్కీ ధరించిన ఆభరణాలను పలువురు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు నిక్కీ గల్రానీ

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నిరాదరణకు గురైన వృద్ధులను గుర్తించి వారికి నెలకు సరిపడా నిత్యావసరాలను తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సనత్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దశరధరామిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటంబేడు రోడ్డంటే హడలే..



భారీ వర్షాలకు గుంతలమయంగా తయారైన రోడ్డు

తడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భారీ వర్షాలకు రోడ్డు దెబ్బ తినడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయం నుంచి తడ మండలం వాటంబేడుకు సుమారు 10 కిలోమీటర్ల మేర తారురోడ్డు ఉంది. 2016లో దెబ్బతిన్న ఈ రహదారిని అప్పటి ప్రభుత్వం సుమారు 2 కోట్ల రూపాయలు వెచ్చించి పునర్నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈరోడ్డు కొంతమేర దెబ్బతింది. గతేడాది కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తాత్కాలి మరమ్మతులు చేసింది. ఇటీవల వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గుంతలమయమైపోయింది. దారిలో వెళ్లాలంటేనే వాహనదారులు బెంబెలెత్తుతున్నారు.

సైన్స్ టాలెంట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని సైన్స్‌సెంటర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌టాలెంట్ సెర్చ్ పోటీల్లో గూడూరుకు చెందిన ఎల్‌ఏపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. జిల్లాస్థాయిలో రెండోస్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి విజేతలైన విద్యార్థులు చరణ్, హర్ష, వినీల్‌కుమార్‌లను అభినందించారు.

నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే



నిశ్చితార్థ వేడుకల్లో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన నిశ్చితార్థ వేడుకల్లో సీఎం చంద్రబాబుతో కలసి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. దొరవారిసత్రం మండలం తనియాలికి చెందిన పారిశ్రామికవేత్త లోకాద్రినాయుడు కుమారుడి నిశితార్థ వేడుక విజయవాడలో ఆదివారం జరిగింది. ఆ వేడుకలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాయకులు తిరుమూరు సుధాకరరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలచంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడే విజయకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో పేట కళాకారులు భేష్



నృత్య పోటీల్లో ప్రతిభ కనబరచిన పేట క్రీడాకారులు

నాయుడుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో ఆదివారం జరిగిన వివిధ రకాల నృత్య పోటీల్లో నాయుడుపేట కళాకారులు ప్రతిభ కనపరచినట్లు ఆదివారం నాయుడుపేట డ్యాన్స్ అకాడమి డైరెక్టర్ జీడీ మాస్టర్ తెలిపారు. భరతనాట్యం, ఫోక్‌డ్యాన్స్, వెస్టన్ డ్యాన్స్‌ల్లో నాయుడుపేటకు చెందిన 17 మంది చిన్నారులు ప్రతిభ కనపరచినట్లు ఆయన పేర్కొన్నారు. వీరంతా ప్రతిభా అవార్డులను పొందినట్లు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం జరిగింది. కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా రెండు విభాగాలకు చెందిన ప్లెటూన్‌లు కవాతు చేశారు. అదే విధంగా కమాండర్లుగా మనోహర్, హరికృష్ణలు వ్యవహరించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లలో క్రమశిక్షణ. నాయకత్వం, సేవాభావంపై ప్రేరణ నింపేలా ముఖ్యవక్తలు ప్రసంగించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

చెందోడులో రక్తదాన శిబిరం



కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెందోడులో ఆదివారం ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. శిబిరాన్ని వైసీపీ నాయకులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. గూడూరుకు చెందిన మెడీపల్స్ రక్తనిధి దాతల ద్వారా రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను దువ్వూరు శ్రీనివాసులురెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు ఎం లీలామోహన్, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉచిత శిక్ష ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శాంతస్ఫూర్తిసేవ ఫౌండేషన్ సంస్థ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇంటర్ పాస్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్, నగర పరిధి నివాసులు, 18నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి మాత్రమే ఈ అవకాశం. ఆధార్, 10వ తరగతి, ఇంటర్ మార్కులిస్టులు, రేషన్ కార్డు జిరాక్సులు, పాస్‌పోర్టుసైజు రెండు ఫొటోలతో సోమవారం ఉదయం తాజ్‌హోటల్‌కు చేరుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి బుధవారం నుంచి 45రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట, చిల్లకూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడనుంది. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ ఈఈ నరేంద్రరెడ్డి కోరారు. నాయుడుపేట, కృష్ణపట్నం పోర్టు ఎక్స్‌ప్రెస్ వేకు సంబంధించి చెందోడు సబ్‌స్టేషన్ పరిధిలో 132 కేవీ లైన్ టవర్ల నిర్మాణ నేపథ్యంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కోట మండలం, కోట, విద్యానగర్, సిద్ధవరం, కొత్తపాళెం, చిల్లకూరు మండలంలోని చింతవరం, వరగలి, తమ్మినపట్నం ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఓల్టేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.. ఈ పనులను ట్రాన్స్‌కో ఈఈ బాలకేశవులు, డీఈలు ప్రసాద్, చిన్నయ్యలు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి భజన



గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుమ్మరవీధిలోని సత్యసాయి ప్రేమసుధా మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయిసత్య వ్రతం నిర్వహించి భజనలు చేశారు. బాబాను అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో పూజలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం మంగళవాయిద్యాల, కోలాటాల నృత్యాల నడుమ బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తూ నగరోత్సవం నిర్వహించారు.

ప్రమాదవశాత్తు
చెరువులో పడి వృద్ధురాలి మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు సత్యనారాయణ, మస్తాన్ నాయుడు- సుబ్బమ్మ(ఫైల్‌ఫొటో)



బాలాయపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వృద్ధురాలు చెరువులో పడి మృతిచెందింది.. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన ఆవుల సుబ్బమ్మ(63) రోజూ పశువుల పేడను ఎత్తివేసి తట్టను పక్కన్నే చెరువులో శుభ్రపరిచేంది. ఈక్రమంలో ఆదివారం కూడా తట్టను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడి ప్రాణాలు కోల్పోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీవో నారాయణలు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మస్తాన్‌నాయుడులు సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

బైక్ మీద నుంచి జారిపడి మహిళ మృతి



మృతి చెందిన సుప్రియ

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుమారుడితో కలిసి వస్తూ ద్విచక్ర వాహనం నుంచి కింద పడి తల్లి ప్రాణాలు కోల్పోయింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం వజ్జావారిపాళెం గ్రామానికి చెందిన సుప్రియ(50), ఆమె కుమారుడు కలసి ద్విచక్ర వాహనంపై సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంకుకు చేరుకున్నారు. పెట్రోల్ ఆయిల్ నింపుకున్నాక తల్లి, కుమారుడు తిరిగి రోడ్డు మీదకు వస్తుండగా ప్రమాదవశాత్తు సుప్రియ జారి కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే ఆమెను కోట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వస్తుండగానే మృతి చెందింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సూళ్లూరుపేటకు చెందిన శ్రీనివాసులు స్నేహితుడితో ఆదివారం రాత్రి కారులో తడకు బయలుదేరాడు. మాంబట్టు సెజ్ రోడ్డువద్ద రాంగ్‌రూట్‌లో ఓ బైక్ కారును ఎడమవైపు ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న టింకు కుమార్, కాఖలేష్ కుమార్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరు బీహార్ రాష్ట్రానికి చెందిన వారు. మాంబట్టు సెజ్‌లోని ఓ పరిశ్రమలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నట్లుగా తెలుస్తుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గూడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు, ఆహారపొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మోహన్, వేణు దాతృత్వంతో చలికాలంలో పేదలకు దుప్పట్లను అందజేశామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, అమరయ్య, గోకుల్, పవన్, జశ్వంత్, శ్రీనివాసులు, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెలుగుల కోసం గిరిజనుల ఇక్కట్లు







గొట్టికాడులో గిరిజనకాలనీలో కర్రలే విద్యుత్ స్తంభాలు- ముళ్లచెట్లు నిండిన వీధి- వాక్యం గిరిజన కాలనీలో ఒకే స్తంభానికి వైర్లు తగిలించారిలా..

బాలాయపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల గిరిజన కాలనీల్లో ప్రాథమిక వసతులు కరువయ్యాయి. ఇక్కడి ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తూ సర్దుకుపోతున్నారు. గొట్టికాడు గిరిజన కాలనీలో సుమారు 70 కుటుంబాలుంటున్నాయి. ఇక్కడి విద్యుత్ సమస్య వెంటాడుతోంది. రాత్రి వేళ అంధకారం రాజ్యమేలుతోంది. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదమని తెలిసినా స్థానికులు కర్రలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ఇళ్లకు వీటి ద్వారానే విద్యుత్ సరఫరా పొందుతున్నారు. స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరినా ఎవరూ స్పందించడంలేదని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. నివాస ప్రాంతంలో సరైన రహదారి లేదు. అంతర్గత వీధులన్నీ ఎత్తు పల్లాలతో ఉంది. ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. ముళ్ల చెట్లను తొలగించి మట్టి తోలినా సరిపోతుందని స్థానికులు చెబుతున్నారు. వాక్యం గ్రామంలోని గిరిజన కాలనీలో కూడా తగినన్ని విద్యుత్ స్తంభాలు లేవు. కర్రలే విద్యుత్ స్థంభాలుగా ఏర్పాటు చేసుకుని ఒకే లైన్ నుంచి విద్యుత్ తీసుకుంటున్నారు. స్తంభాలు లేక ఇళ్లపై కరెంటు తీగలు వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు 60కి పైగా కుటుంబాలుంటున్నాయి. విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు







చిల్లకూరు-ఓజిలి-సూళ్లూరుపేటల్లో సత్యసాయికి నివాళులర్పిస్తున్న అధికారులు,నాయకులు

చిల్లకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయిబాబా చిత్రపటానికి తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కలిసి పూలమాలు వేసి నివాళులర్పించారు.. చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, సురేష్‌బాబు, జగదీష్, శివ తదితరులు పాల్గొన్నారు. **ఓజిలి :** మండల పరిషత్ కార్యాలయంలో సాయిబాబా చిత్ర పటానికి ఎంపీడీవో నారాయణరెడ్డి, తహసీల్దారు పద్మావతిలు పూలమాలవేసి నివాళులర్పించారు. పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. **దక్కిలి:** తమ కార్యాలయంలో సత్యసాయి చిత్రపటానికి తహసీల్దారు శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. **తడ/సూళ్లూరుపేట:** సూళ్లూరుపేట సత్యసాయి మందిరంలో జరిగిన వేడుకల్లో ఆర్డీవో కిరణ్మయి, ఎవో రవికుమార్, తహసీల్దారు గోపీనాథ్‌రెడ్డి తడలో ఎంపీడీవో శేఖర్ నాయక్ పాల్గొన్నారు.**బాలాయపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీవో నారాయణ, రాయి సత్యనారాయణ, మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. **వెంకటగిరి టౌన్:** పట్టణంలోని రాజావీధిలోని సత్యసాయి సేవా సమితి మందిరంలో తహసీల్దార్ నరసింహారావు, వెంకటగిరి రాజా కుటుంబీకులు వీబీ సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచేంద్ర, సత్యప్రసాద్ యాచేంద్ర, నిర్వహకులు రామెహన్ రావు, నాగరాజారావు, కుమార్, లీలమ్మ తదితరులు పాల్గొన్నారు. **కోట:** తహసీల్దారు కార్యాలయంలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను వాకాడు వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ మర్రి ప్రమీల ప్రారంభించారు. తహసీల్దారు జయజయరావు తదితరులు పాల్గొన్నారు.





కోట- వెంకటగిరిల్లో సత్యసాయికి నివాళులర్పిస్తున్న అధికారులు- నాయకులు

శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం



పగుళ్లు ఏర్పడిన సీలింగ్



పాతబడిన కార్యాలయం

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది.ఎప్పుడు ఏం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.ఈ కార్యాలయం మూడు దశాబ్దాల క్రితం నిర్మించారు. లోపలి గదుల్లో సీలింగ్ దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. సిబ్బందిపై పడుతున్నాయి. ప్రస్తుత వర్షాలకు గదులన్నీ పూర్తిగా ఉరుస్తున్నాయి. విలువైన రికార్డులు తడిసిపోతున్నాయి. వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలు, విలువైన రికార్డులు ఉండే గదుల గోడలు పూర్తిగా పగుళ్లిచ్చాయి. పెచ్చులూడిపోతున్నాయి. కార్యాలయంలోని పలు గదులకు కిటికీలు లేకపోవడంతో సిబ్బంది అర్జీదారులు తడుస్తూనే విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పలుపనులపై కార్యాలయంకు వచ్చే ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. తాజా వర్షాలకు ఎక్కడ ఏం కూలుతుందోనని రెవెన్యూ సిబ్బంది హడలిపోతున్నారు.

వర్గీకరణపై ఉద్యమించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న చింతామోహన్, విజయకుమార్ తదితరులు

కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు మాలలకు అన్యాయం చేశాయని పలువురు వక్తలు విమర్శించారు. దీనిపై గట్టిగా ఉద్యమించాలని వారు కోరారు. కోటలో ఆదివారం రాత్రి బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఐఏఎస్ అధికారి విజయకుమార్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్, రచయిత, గాయకుడు, రేంజర్ల రాజేష్, గెజిటెడ్ మాల ఉద్యోగుల కార్యదర్శి శ్రీనివాసరావు, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, గౌరవాధ్యక్షుడు దాసరి సుందరంలు ప్రసంగించారు. ఏబీసీడీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం బలంగా చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. ఏపీలో ఇప్పటికే పోరాటానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఆర్టీసీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదిక వరకూ మోటారు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక నాయకులు పాలా మల్లికార్జునరావు, పనబాక హేమంత్, సాయి, అశోక్‌కాంబ్లే, పోలయ్య, కోటేశ్వరరావు, కేశవ, డీవీ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

హోరాహోరీగా అంతర్‌జిల్లా అండర్-14 హాకీ పోటీలు

చంద్రగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో రెండోరోజైన ఆదివారం అంతర్ జిల్లా అండర్-14 హాకీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. లీగ్ పోటీలను నాలుగు గ్రూపులుగా విభజించారు. వీటిలో విన్నర్స్ రన్నర్స్‌గా బాలుర జట్లు ఎనిమిది, బాలికల జట్లు ఎనిమిది నాకౌట్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ దశలో నిర్వహించిన బాలుర మొదటి క్వార్టర్ ఫైనల్‌లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి జట్ల మధ్య మ్యాచ్ జరగగా 4-3 గోల్స్‌తో విశాఖ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో కర్నూలుపై తూర్పుగోదావరి 4-0 గోల్స్‌తో, మూడవ మ్యాచ్‌లో కడప, నెల్లూరుపై 5-0 గోల్స్ తేడాతో, నాలుగవ మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళంపై 2-1 గోల్స్ తేడాతో గెలిచి, సెమీఫైనల్స్‌కి చేరాయి. అలాగే బాలికల మ్యాచ్‌ల్లో నాకౌట్ దశలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్‌లో మొదటి మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై, విశాఖపట్నం జట్టు 1-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై, తూర్పుగోదావరి 8-0 గోల్స్ తేడాతో, మూడో మ్యాచ్‌లో కడప, నెల్లూరుపై 9-0 గోల్స్ తేడాతో, నాల్గవ మ్యాచ్‌లో అనంతపురం జట్టు, కర్నూలు జట్టుపై 7-0 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌కి ప్రవేశించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్, భార్గవి, దేవి, అబ్జర్వర్ థామస్, ఆర్కే సెలవపాండెనే, కేశవయ్య, హరికృష్ణ, కిరణ్‌కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

డిసెంబరు 31లోపు
అదనపు లోడు క్రమబద్ధీకరించుకోండి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని తిరుపతి సర్కిల్ పరిధిలోవున్న గృహ విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ వినియోగం కంటే అదనంగా వున్న లోడ్‌ను డిసెంబరు 31వ తేదీ లోపు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఎస్‌ఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. క్రమబద్ధీకరణ చేసుకోవలసిన సమయాన్ని ఈ ఏడాది చివరి వరకు పొడిగించి, రాయితీ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వినియోగదారులు పెరిగిన లోడ్‌కు అనుగుణంగా ఒక కిలో వాట్‌కు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని ఆయన కోరారు.

చైల్డ్ సేఫ్టీపై శిక్షణ

తిరుపతి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన చైల్డ్ సేఫ్టీ(బాలసురక్ష) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు ఆధ్వర్యంలో నారీసెల్ ఇంపాక్ట్ ట్రైనర్స్ జి.సాగరిక, ఆర్.లత పాల్గొని బాలసురక్ష కార్యక్రమం ద్వారా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చారు. లైంగిక వేధింపులు, లైంగిక దాడులను దీటుగా ఎదుర్కోవడం, భయాన్ని పోగొట్టడానికి సరైన నైపుణ్యంతో పిల్లలను తీర్చిదిద్దే అంశాలపై అవగాహన కల్పించారు.